క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

వర్గల్(గజ్వేల్): గజ్వేల్ 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం వర్గల్ మండలంలోని గౌరారం, మజీద్‌పల్లి, నెంటూరు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంతోష్ శుక్రవారం తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గౌరారం, సింగాయపల్లి, చౌదరిపల్లి, మక్త, మజీద్‌పల్లి, దండుపల్లి, నెంటూరు, సామలపల్లి, గోవిందపూర్, గిర్మాపూర్, మాదారం గ్రామాలకు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పేద కుటుంబానికి భరోసా



నిత్యావసర సరుకులను అందిస్తున్న సభ్యులు

సాక్షి ఎఫెక్ట్

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని వట్టిపల్లికి వలస వచ్చిన నిరుపేద కుటుంబం పెద్ద అనారోగ్యంతో మృతి చెందడంతో భార్య, ముగ్గురు పిల్లలు అనాథలుగా మారడంపై ఈనెల 14వ తేదీన సాక్షిలో 'వలసొచ్చిన కుటుంబానికి దుఃఖమే మిగిలింది' అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించి శుక్రవారం గజ్వేల్‌కు చెందిన భరోసా ఫౌండేషన్ సభ్యులు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.6 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు ముగ్గురు పిల్లలకు రూ.15 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాలను వారికి అందజేశారు.

కల్లు గీత కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న బండి శ్రీనివాస్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ వృత్తిరీత్యా కల్లు గీత కార్మికుడు. శుక్రవారం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను ప్రభుత్వ ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు మార్క అనిల్ గౌడ్ కోరారు.

22న శ్రీరాముడి పూజలు



మాట్లాడుతున్న భక్తులు

సిద్దిపేటకమాన్: శ్రీరాముడి జన్మభూమి అయోధ్యలో ఈనెల 22వ తేదీన సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సిద్దిపేటలో శ్రీరాముడికి పూజలు చేయనున్నట్లు భక్తులు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిద్దిపేట 39వ వార్డు కౌన్సిలర్ దీప్తి ఆధ్వర్యంలో పట్టణంలోని సుభాష్‌రోడ్‌లో ఈ నెల 22వ తేదీన శ్రీరాముడి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ, పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనాదం, మహేష్, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ



ఇబ్రహీంనగర్‌లో అయోధ్య అక్షింతలు, కాషాయ జెండాల పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట): అయోధ్యలో శ్రీరామ మందిర అక్షింతలను శుక్రవారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్, అనంతసాగర్ గ్రామాల్లో ఇంటింటికి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులకు అక్షింతలతో పాటు కాషాయ జెండాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ సంకీర్తన, ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు, రామభక్తులు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరుకు చెందిన మల్యాల యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. యాదగిరి చిన్ననాటి స్నేహితులు శుక్రవారం మిత్రుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. తమ వంతు సాయంగా రూ.14 వేల నగదు, బియ్యం అందజేశారు.

గురుకులంలో దరఖాస్తుల ఆహ్వానం

- ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌కు అవకాశం
- సద్వినియోగం చేసుకోవాలన్న అధికారులు

నిరుపేద మైనార్టీ కుటుంబాలకు చెందిన పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు ప్రభుత్వం గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేసింది. జిల్లా వ్యాప్తంగా ఆరు మైనార్టీ గురుకుల పాఠశాలలున్నాయి. వీటిలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధిస్తారు. అంతేకాకుండా విద్యార్థులు భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను తట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. దీంతో గురుకుల పాఠశాలల్లో చేరేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. పాఠశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.



దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాల

దుబ్బాక: పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఉచిత విద్యతో పాటు వసతి కల్పించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసించేందుకు మైనార్టీ విద్యార్థులకు గురుకులాలు వరంగా మారాయి. ఈ గురుకులాల్లో నిష్ణాతులైనా ఉపాధ్యాయుల విద్యాబోధన అందుతుంది. 2024–25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఆరు పాఠశాలలు

సిద్దిపేట జిల్లాలో ఆరు మైనార్టీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. దుబ్బాకలో బాలురు, సిద్దిపేటలో బాలురు, బాలికలు, గజ్వేల్‌లో బాలురు, బాలికలు, హుస్నాబాద్‌లో బాలికల పాఠశాలలున్నాయి. జిల్లాలోని ఐదు పాఠశాలలో 5వ తరగతిలో 80 సీట్లు ఉండగా దుబ్బాకలో 40 సీట్లు ఉన్నాయి. ఆరు పాఠశాలల్లో మొత్తం 440 సీట్లు ఉన్నాయి. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి మొత్తం 480 సీట్లు ఉన్నాయి. మిగిలిన తరగతుల్లో సీట్ల ఖాళీలను బట్టి ప్రవేశం కల్పిస్తారు. ఈ విద్యాలయాల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుంది. విశాలమైనా తరగతి గదులున్నాయి. విద్యార్థులకు క్రీడలు, యోగాసనాల్లో శిక్షణ ఇస్తారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. 10వ తరగతి తర్వాత ఎంచుకోవాల్సిన కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

ముస్లింలకు 51 సీట్లు

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి http://tmreirteanfana.gov.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో పాఠశాలలో ముస్లింలకు 51, క్రిస్టియన్లకు 5, జైనులు, పార్శిలు, సిక్కులు, బౌద్ధులకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 60 సీట్లు, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, బీసీలకు 10, ఓసీలకు రెండు చొప్పున మొత్తం 20 సీట్లు కేటాయించారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దరఖాస్తులకు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేయాలి.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతీ విద్యార్థి చదువుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. నాణ్యమైన భోజనం అందించడంతోపాటు నిపుణులైన అధ్యాపకులతో విద్య నందిస్తున్నాం. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– షేక్ అహ్మద్, మైనార్టీ జిల్లా సంక్షేమ శాఖ అధికారి



సికింద్లాపూర్ గ్రామ చావిడి వద్ద సీనియర్ సిటిజన్‌ల కాలక్షేపం

మా ఊరు ముచ్చట్లకు అడ్డా!

మా ఊరు ముచ్చట్లకు అడ్డా. సీనియర్ సిటిజన్ల కాలక్షేపానికి నిలయం చావిడి. మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామ నడిబొడ్డునగల గ్రామ చావిడి ఎన్నో ఏళ్లుగా గ్రామపెద్దలకు కాలక్షేపం. గ్రామంలోని ముఖ్య అంశాలు, మంచి చెడు తదితర అంశాలను ఈ చావిడి వద్దే చర్చించుకుంటారు. – చిన్నకోడూరు(సిద్దిపేట)

ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కే అత్యధిక స్థానాలు



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఫారూఖ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాల్లో గెలుపొందడం ఖాయమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కేపీఆర్ సేన నూతన సంవత్సర క్యాలండర్, డైరీని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఆస యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీకి పరామర్శ

గుండె శస్త్ర చికిత్స చేయించుకొని హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌ను శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకొన్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సికిందర్ ఉన్నారు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న రమేష్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, ములుగు మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. అలాగే మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో బండ నర్సంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గంగాల సుధాకర్ తదితరులు హైదరాబాద్‌లోని మంత్రి పొన్నం నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట్రాంరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రోడ్డు ప్రమాదాలను నివారిస్తూ ప్రమాద రహిత జిల్లాగా సిద్దిపేటను నిలుపుదామని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా రవాణ శాఖ కార్యాలయంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు నిర్లక్ష్యం, అతివేగమే కారణమన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు లక్ష్మణ్, కవిత, వాహనదారులు పాల్గొన్నారు.

లింగంపేటలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

తొగుట(దుబ్బాక): బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర మండల కో ఆర్డీనేటర్, చందాపూర్ సర్పంచ్ నర్సింహులు యాదవ్ కోరారు. మండలంలోని లింగంపేట, చందాపూర్ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో చందన ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఏపీజీవీబీ, ఎస్‌బీఐ తొగుట బ్రాంచి మేనేజర్లు ప్రశాంత్ భరత్ కుమార్, ఫణి, సరేష్ కుమార్ బ్యాంకులు అందిస్తున్న సేవల గురించి తెలియ జేశారు. కార్యక్రమంలో లింగంపేట సర్పంచ్ రేణుక, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే కొనుగోలు



హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఉన్నప్పటికీ వ్యాపారులు మార్కెట్ యార్డులో కొనుగోలు చేయకుండా రోడ్డుపైనే వాహనాలు ఆపి కొనుగోళ్లు చేస్తున్నారు. శుక్రవారం ఓ రైతు బొబ్బర్లు తీసుకొని హుస్నాబాద్‌కు రావడంతో అంబేద్కర్ చౌరస్తాలోనే వ్యాపారులు కొనుగోలు చేశారు. రోడ్డుపై కొనుగోలు చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

అందరూ బాధ్యతగా ఉండాలి

చిన్నకోడూరు ఎస్‌ఐ సుభాష్



మాట్లాడుతున్న ఎస్‌ఐ సుభాష్

సిద్దిపేటరూరల్: మహిళల పట్ల అందరూ బాధ్యతగా ఉండాలని చిన్నకోడూరు ఎస్‌ఐ సుభాష్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నారాయణరావుపేట మండల పరిధిలోని మాటిండ్ల ఆర్డీఎఫ్ పాఠశాలలో సిద్దిపేట షీటీం, చిన్నకోడూరు పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో మహిళల రక్షణ అందరి బాధ్యత అంశంపై అవగాహన కల్పించారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఫోన్ వాడకం వల్ల జరిగే అనర్థాలను ఎస్‌ఐ వివరించారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు, ఏఎస్‌ఐ కిషన్‌పవార్, పీసీ లక్ష్మినారాయణ, కానిస్టేబుళ్లు వీణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): చిన్నకోడూర్ మండలం మల్లారం నుంచి బెజ్జంకికి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక టిప్పర్లను బెజ్జంకి తహసీల్దార్ శ్యాం శుక్రవారం పట్టుకున్నారు. టిప్పర్ల యజమానులకు రూ.3 వేల చొప్పున జరిమానావిధించారు. ప్రభుత్వ అనుమతితో మట్టిని తరలించాలని సూచించారు.

కామన్ స్కూల్ విద్యా విధానం ప్రవేశపెట్టాలి



నంగునూరులో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులకు నాణ్యమైన, శాస్త్రీయ విద్య అందాలంటే కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని టీపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు పొన్నమల హరికృష్ణ డిమాండ్ చేశారు. నంగునూరులో శుక్రవారం టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నరేశ్, రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాజు, నగేశ్, వంశీ, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల హక్కులు కాపాడాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

గజ్వేల్‌రూరల్: ఉపాధి హామీ కూలీల పనిహక్కులను కాపాడాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన సీఎం ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘించిందని, ఈ చట్టం ప్రకారం ఏడాదికి వంద రోజుల పని కల్పించాలన్నారు. కనీస వేతనంతో పాటు మహిళలు, పురుషులకు సమాన వేతనం చెల్లించాలని ఉందన్నారు. గతంలో మాదిరిగా టస్మాను పునరుద్ధరించాలని కోరారు. ప్రతీనెల మంత్రి, ఉన్నతాధికారుల సమక్షంలో సమీక్ష నిర్వహించాలని, సామాజిక తనిఖీ చేపట్టాలన్నారు.

పంటల పరిశీలన



తిమ్మాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్, బస్వాపూర్, వట్టిపల్లి గ్రామాల రైతులు సాగుచేస్తున్న పంటలను శుక్రవారం ఏరువాక కేంద్రం తొర్నాల ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి, కో ఆర్డినేటర్ విజయ్, సరిత, రమాదేవి పరిశీలించారు. యాసంగిలో సాగు చేసిన మిర్చి, బీన్స్, వరి, మొక్కజొన్న శనగ పంటలను పరిశీలించారు. పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు తీసుకునే జాగ్రత్తలను రైతులకు వివరించారు. అలాగే పంట రక్షణకు సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు మేరకు మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ వసంతరావు, ఏఈఓలు కిరణ్, కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

నర్సరీ తనిఖీ



గౌరవెల్లి నర్సరీని తనిఖీ చేస్తున్న డీపీఓ దేవకీ దేవి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి గ్రామ నర్సరీని శుక్రవారం డీపీఓ దేవకీ దేవి తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నర్సరీలో పెంచుతున్న ప్రతీ మొక్కను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హరితహారంలో నాటిన మొక్కలను చంటిపాపలా కాపాడుకోవాలని సూచించారు. మొక్కలు ఎండిపోతే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ కవికుమార్, గ్రామ సర్పంచ్ బైరగోని పుష్పలీల, పంచాయతీ కార్యదర్శి మాలోతు నిర్మల, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటస్వామి, నాయకులు బైరగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

దొమ్మాట మాజీ సర్పంచ్ మోహన్‌రావు



దౌల్తాబాద్: ట్రోఫీ అందజేస్తున్న మోహన్‌రావు, రాజేందర్

దౌల్తాబాద్(దుబ్బాక): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని దొమ్మాట గ్రామ మాజీ సర్పంచ్ మోహన్‌రావు అన్నారు. మోహన్‌రావు ఆధ్వర్యంలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. మూడు రోజులపాటు కొనసాగిన టోర్నమెంట్ గురువారం సాయంత్రం ముగిసింది. విజయం సాధించిన జట్లకు మోహన్‌రావు బహుమతులతో పాటు ప్రైజ్‌మనీ అందజేశారు. కార్యక్రమంలో మండల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్ర సత్యం, మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు నర్ర రాజేందర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కరికే శంకర్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సల్లా స్వామి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చీరల పంపిణీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి గ్రామ సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగరావు శుక్రవారం గ్రామ అంగ్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే ప్రతీ కార్యక్రమంలో తమవంతు పాత్ర పోషించి ప్రజలకు మేలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మమత, ఎంపీటీసీ లక్ష్మి, శ్రీనివాస్, వెంకటస్వామి, సంపత్, సీఏలు వీఓలు అనంతలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

◆ అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టాలి

గజ్వేల్‌రూరల్: గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండా వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణు శుక్రవారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పొటో పెట్టకుండా జెండావిష్కరణ చేయడం సమంజసం కాదన్నారు. అంబేద్కర్ గురించి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

◆ పరోపకారంతో దైవానికి చేరువ



కొండపాక(గజ్వేల్): దైవాన్ని చేరువకావడానికి పరోపకారమే సులువైన మార్గమని విజయదుర్గా ఉపాసకుడు చెప్పెల హరినాథ శర్మ అన్నారు. మర్పడ్గలోని విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో విజయదుర్గ పీఠాధిపతి వెదురుపాక గాడ్ జన్మదిన వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాథ శర్మ మాట్లాడుతూ పీఠాధిపతి వెదురుపాక గాడ్ బోధనలు అనుసరణీయమన్నారు. క్షేత్రం ఆవరణలో 27 నక్షత్రాలు 12 రాశులకు సంబంధించిన మొక్కలను నాటారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆదర్శ గ్రామ రికార్డులు స్వాధీనం



సిద్దిపేటరూరల్: ఆదర్శ గ్రామం ఇబ్రహీంపూర్ పంచాయతీలో అవినీతి, అక్రమాలు జరిగాయనే ఆరోపణల మేరకు శుక్రవారం రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు నారాయణరావుపేట ఎంపీఓ శ్రీనివాస్ తెలిపారు. గ్రామ పంచాయతీలో అవినీతి, అక్రమాలు జరిగాయని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ ప్రతినిధులు డీపీఓకు ఫిర్యాదు చేశారని, ఆదేశాల మేరకు రికార్డులను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవయ్య, ఉప సర్పంచ్ దేవయ్య, పంచాయతీ కార్యదర్శి అర్షద్, కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ ఎస్‌ఏటీలో అర్హత సాధించిన రాజు

దౌల్తాబాద్(దుబ్బాక): ఏటా జాతీయ స్థాయిలో యూజీసీ–ఎంటీఏ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటి టెస్ట్‌లో అర్హత సాధించినట్లు మండల యువకుడు రాజు శుక్రవారం తెలిపాడు. మండల పరిధిలోని శౌరీపూర్ గ్రామానికి చెందిన చెన్నరాజు కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ తెలుగు అభ్యసించాడు. ప్రస్తుతం ఆయన వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. జాతీయ స్థాయిలో వివిధ యూనివర్సిటీలకు చెందిన పీజీ విద్యార్థులు ఎస్‌ఏటీ పరీక్షలో అర్హత సాధిస్తే లెక్చరర్ ఉద్యోగానికి అర్హులవుతారన్నారు.

◆ అవినీతిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటరూరల్: జిల్లా గ్రంథాలయంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లో వినతి పత్రం ఇచ్చినట్లు యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌వీర్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో ఉన్న జిల్లా గ్రంథాలయంలో నిర్వహణ పేరిట కొన్ని సంవత్సరాలుగా అవినీతి జరుగుతోందన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చెల్లి రవి, రాగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

